


నాగేంద్ర, నాగమణి ప్రేమించుకున్నారు.

నాగమణి స్వేచ్ఛా విహంగిని. పలుచోట్ల పరపురుషులతో చూసిన నాగేంద్ర ఆమె పట్ల విముఖత పెంచుకుని నీరజను పెళ్ళాడేడు. నాగేంద్ర, నీరజల పుత్రరత్నం అయిన శివం ఫిఫ్త్‌క్లాసు చదువుతోన్న రోజులలో అంటే పది సంవత్సరాల తరువాయి నాగేంద్రకు నాగమణి తటస్థ పడింది. అతడు తనకు వ్రాసిన వుత్తరాలను చూపించి అల్లరి చేస్తానని బెదిరస్తూ రాత్రికి తన దగ్గరకు రావలసినదిగా కోరింది నాగమణి.

సంఘంలో మంచివాడుగా, పెద్దమనిషిగా చలామణి అవుతున్న నాగేంద్ర ఒక నిశ్చయానికి వచ్చినట్లుగ్గా నిట్టూర్చి తెల్లారుఝామున 3 గంటలకు వస్తానని చెప్పాడు నాగమణికి. అన్న ప్రకారం అదే టైముకు ఆమె దగ్గరకు వెళ్ళాడు. ఇకపై తనతోనే వుండవలసిందిగా కోరింది నాగమణి. తనకు భార్య, ఒక బాబు వున్నారని, యిక తన్ను మరచి పొమ్మని చెప్పాడు నాగేంద్ర. ఇద్దరికీ ఘర్షణ పెరిగింది. ఆ ఘర్షణలో అనుకోని రీతిగా నాగమణిని నాగేంద్ర గొంతు పిసికాడు. ఆమె వాలిపోగా చనిపోయినట్లు తెలుసుకొని భయంతో బయటపడ్డాడు. ఈ రహస్యాన్ని తనలోనే దాచుకున్నాడు. నాగమణి హత్యకు కారకులెవరో పోలీసులకు అంతు తెలియలేదు. కేసు ఫైలుచేసి వూరుకున్నారు.

పది సంవత్సరాల తరువాత—

"మిస్టర్ నాగేంద్రా! యు ఆర్ అండర్ అరెస్ట్" డ్యూటీలో వున్న యిన్‌స్పెక్టర్ శివం అన్నాడు తండ్రి నాగేంద్రతో.

"ఎందుకు బాబూ, నేను ఏం చేశాన్రా?"

"షటప్, మర్యాదగా మాట్లాడండి. నేను ఇన్స్‌పెక్టర్ శివంని. మిమ్మల్ని అరెస్ట్ చేస్తున్నాను."

"ఎందుకు?"

"పది సంవత్సరాల క్రితం నాగమణిని మీరు హత్య చేసినందుకు"

"అందుకు సాక్ష్యం?"

"ఇదిగో మీ డైరీయే సాక్ష్యం. నిన్న అమ్మ పాత పేపర్లు అమ్ముతుండగా దొరికింది" అన్నాడు శివం తండ్రిని అరెస్ట్ చేస్తూ.

పది సంవత్సరాల నాటి కేసును పరిశోధించి హంతకుణ్ణి పట్టుకున్నందుకు శివంకు ప్రమోషన్ లభించింది. ఆరోగ్యం బాగుండనందుకు నాగేంద్రకు పోలీసుల హయాంలో చికిత్స లభించి ఆరోగ్యం చేకూరింది.

ఆ డైరీ నాగేంద్రది కాదని నరేంద్ర అనే వ్యక్తిదని పాత పేపర్లు కొనేవాడి దగ్గర యిన్‌స్పెక్టర్ శివంకు లభించిందని కోర్టులో వాదించడం వల్ల కేసు కొట్టి వేయబడింది మరిన్ని సంవత్సరాల తరువాత.

— పి. శేషవర్ధనరావు

రామాయణానికి లభిస్తున్న విశేష ఆదరణని బట్టి ఈ సీరియల్‌ని మరో 26 భాగాలు పొడిగిస్తున్నట్టు సమాచార, ప్రసార శాఖల మంత్రి శ్రీ అజిత్‌కుమార్ పాంజా రాజ్యసభలో ప్రకటించారు. మొదట అనుమతించిన 52 భాగాలు వచ్చే జనవరి దాకా ప్రసారం కావాలి. ఇప్పుడు పెంచిన మరో 26 భాగాలతో ఇంకా దాదాపు సంవత్సరందాకా 'రామాయణం' ప్రసారం అవుతుందన్న మాట. ఆంధ్రప్రదేశ్ విద్యుచ్ఛక్తి బోర్డువారు అశేష ప్రేక్షకుల కోరిక మీద, దూరదర్శన్‌వారి కోరిక మీద రాష్ట్రమంతటా 'రామాయణం' సీరియల్ ప్రసార సమయంలో కరెంటు కోత వుండదని ప్రకటించారు. ఈ వార్త విని ప్రేక్షకులంతా ఎంతో ఆనందించారు. ఇలాంటి ఘనత దక్కిన మొట్టమొదటి సీరియల్ రామాయణే. ఈ గొప్పతనమంతా ఒక్క సాగర్‌దే కాదు. వాల్మీకి, తులసీదాస్‌లది కూడా!

ప్రముఖ సినీ నటి షర్మిలా ఠాగూర్ ప్రస్తుతం ఒక పదమూడు వారాలపాటు టి.వి. తెర మీద దర్శనమిస్తోంది. జ్ఞాన్‌పీఠ్ అవార్డు గ్రహీత అమృతా ప్రీతమ్ రచన ఆధారంగా తీసిన 'జిందగీ' సీరియల్‌లో షర్మిలా ప్రధాన పాత్ర వహిస్తోంది. నవంబరు 23, సోమవారం నుంచి ప్రారంభమైన ఈ 'జిందగీ' సీరియల్‌లో ప్రముఖ తారాగణం చాలామంది కనబడతారు.

సుఖదుఃఖాల కలయికే 'జీవితం'. జీవితం అంతా అందరికీ పూర్తిగా పూలపాన్పు కాదు. ముళ్ళబాట కాదు. సుఖదుఃఖాలు రెండూ వెనువెంటనే సాగుతుంటాయి. ఇదే ఇతివృత్తం మీద తీసిన సీరియల్ 'జిందగీ'. కమల్ (సుప్రియా పథక్) ఒక మధ్యతరగతికి చెందిన యువతి. తల్లి ఉత్తమురాలే అయినా, భర్త పెట్టిన హింసలు, బాధలకి ఆమె చనిపోతుంది. అదే రాత్రి తండ్రితో తెగతెంపులు చేసుకొని అర్ధరాత్రి వర్షంలో ఇంటినుంచి బయటికి వచ్చేస్తుంది. ఉమెన్స్ కాలేజి ప్రిన్సిపాల్ శకున్

## టి.వి. సమీక్ష

(షర్మిలా) ఇంట్లో తల దాచుకుంటుంది కమల్.

* * *

హైదరాబాద్ దూరదర్శన్ ద్వారా 13 వారాలపాటు ప్రసారం అయి, ప్రేక్షకులను నవ్వించి మెప్పించాలన్న ప్రయత్నాలన్నీ నవంబరు 27వ తేదీతో 'దేశంలో ఈ రోజు' సీరియల్ ముగియడంతో సమాప్తం చెందాయి. ఇద్దరు నిరుద్యోగులు బ్యాంకు ఋణం తీసుకుని చిన్నతరహా పరిశ్రమ స్థాపించే అవకాశం రావడానికి 13 వారాల సమయం పట్టింది. సీరియల్ కాబట్టి 13 వారాలు పట్టింది. అదే నిజ జీవితంలో అయితే ఇంకా ఎన్ని వారాలు పడుతుందో?

హైదరాబాద్ దూరదర్శన్ ద్వారా భక్తిరస ప్రధాన నాటకాలు ప్రసారం చెయ్యాలని కొత్త ప్రతిపాదన కాబోలు. శివభక్తుడు 'నందనార్' కథని 'భక్త నందనార్' పేరుతో నాటకంగా ప్రసారం చేశారు. దాదాపు గంట, ముప్పావు నిడివి గల ఈ నాటకాన్ని నవంబరు 17 మంగళవారం, డిసెంబరు 1 మంగళవారం రెండు రోజులు రెండు భాగాలుగా ప్రసారం చేశారు. రాత్రి 7-05 నుంచి 7-30 వరకు, తిరిగి వార్తల తర్వాత 8-05 వరకు ప్రసారం చేశారు.

అంటే మొత్తం ప్రసార సమయాన్ని ఖచ్చితంగా విభజించి ఎన్ని నిమిషాలైతే అంతవరకే ప్రసారం చేసి ఖచ్చితంగా నాటకాన్ని ఆపివెయ్యడమేనా? పాత్రధారి ఇంకా డైలాగ్ చెపుతున్నా అర్థాంతరంగా ఆపివెయ్యడమే సరైన పద్ధతా? ఇదేనా నాటకాన్ని రెండు మూడు భాగాలుగా విభజించి ప్రసారం చేసే పద్ధతి? ఒక ఖచ్చితమైన ఘట్టంతో ఆపివెయ్యడం హైదరాబాద్ దూరదర్శన్‌వారికి సాధ్యం కాని పనా? పైగా ఈ భక్తనందనార్ నాటకం మొదటి భాగం చూసినవారికి ఇది నాటకమా? లేక సంగీత రూపకమా? అన్పించింది. మాటల కన్నా పాటలు ఎక్కువైనాయి. మాటంతో సరిపోయే సన్ని వేశాలలో కూడా పాటలను బలవంతంగా పెట్టి ప్రేక్షకులను బాధపెట్టడం దేనికి? ఒక మంచి భక్తుడి కథని తీసుకుని ఈ విధంగా చెడగొట్టి 'నందుడి' కథ అంటేనే విరక్తి కలిగేలా చేశారు. కొన్ని నాటకాలకి ఇతివృత్తాలు బావుండవు. మరికొన్నింటికి దర్శకత్వం, మాటలు లాంటివి బావుండవు. ఏదైనా చివరికి ఫలితం ఒక్కటే-ప్రేక్షకులని బాధపెట్టడం.

—కల్పనా రెంటాల